అన్నీ యధావిధిగా జరిగిపోయాయి.

ఆ ఇంటితో నాకున్న బంధం... అనుబంధం... ముగిసిపోయింది! చివరిసారిగా ఆ ఇంటిని పరికించి చూసి... మెట్లమీద రెండు క్షణాలు ఆగుదామని కూర్చున్నాను! నా భుజం మీద చేయి పడినట్లు... ఉలికిపాటుతో వెనక్కి తిరిగి చూసాను. ఆమెని చూసి అప్రయత్నంగా 'అమ్మా... మీరేమిటీ... ఇక్కడ...' అంటూ ఆశ్చర్యంతో నసిగాను.

"ఇక్కడ... ఇలా కూర్చోవటం కూడా హాయిగా ఉంది! మొదటిసారిగా ఈ ఇల్లూ, ఈ పరిసరాలూ కూడా నచ్చినట్లనిపిస్తున్నాయి! ఉత్తరం చదివాను..." ఆ మాటతో ఆమె గొంతు బొంగురుపోయింది.

"ఒక్కసారి... ఒకే ఒక్కసారి... అవకాశం వచ్చి... నేనూ ఆయనతో నాలుగు మాటలు చెప్పగలిగితే.. ఎంత బావుండునూ... అనిపిస్తోందిగానీ... ఇక అది జరగదని తెలిసాక... తట్టుకోవటం కష్టంగా ఉంది...!"

అప్పటివరకూ దుఃఖాన్ని మౌనంగా భరిస్తున్నట్లుగా కనిపించిన అమ్మగారు.. అప్పుడు బోరుమన్నారు!నేను దిగ్భ్రాంతితో ఏం మాట్లాడాలో తోచనట్లుగా చూస్తుండిపోయాను.



మరుక్షణమే తేరుకున్నట్లు... సర్దుకుని " వారు.. నిన్ను మరో కొడుకులా భావించమని ఆ ఉత్తరంలో నన్ను హెచ్చరించినట్లనిపించింది! ఇప్పుడు నేనూ నీకో మాట చెబుతున్నాను... మీ అమ్మ మాత్రమే కాకుండా నీకు. ఇంకో అమ్మ కూడా ఉందని గుర్తు పెట్టుకోమని...!"

ఆ రెండు మాటలూ చెప్పి పరుగులాంటి నడకతో లోపలకు వెళ్ళిపోయారు, ఒక విధమైన... దిక్కుతోచని స్థితిలో అలాగే కూర్చుండిపోయా...!

నా భుజంమీద... అమ్మగారి చేతి స్పర్శ చల్లగా, మృదువుగా నిలిచిపోయిందా అన్నట్లనిపించింది... గొప్ప ఓదార్పు లభించిన అనుభూతి కలిగింది!

రెండు క్షణాల తర్వాత ఓపిక తెచ్చుకుని మా ఇంటివైపుగా అడుగులు వేసాను. అమ్మకు శారీరకంగా ఓపిక తగ్గింది. నేనూ పనుల పట్ల నిరాసక్తత పెంచుకున్నాను! మాధవి ఒక్కదానిమీదే... పని భారం అంతా మోపబడింది.

ఒకరోజు... ఇదేమాట అంటే.. మాధవి నిట్టూరుస్తూ జవాబు చెప్పింది. 'ఈ పనులేమీ ఇబ్బందిగా అనిపించటం లేదు. రోజురోజుకీ నిరుత్సాహంగా మారిపోతున్న మీ వాలకమే నన్ను ఇబ్బంది పెడుతోంది... కాదు... భయంగా కూడా ఉంది...!'

మాధవి అంత బేలగా మాట్లాడటం... నేనెప్పుడూ వినలేదు. అందుకే కలవరపడ్డాను. నా తీరు మార్చుకోవాలనుకున్నాను. ఉత్సాహం తెచ్చుకుని తిరగటం మొదలుపెట్టాను. ఊళ్ళోకి తిరిగి వస్తున్నాను.

పంటలు సరిగా పండటం లేదని, కరువు పెరుగుతోందని అందరూ అనుకోవటం విన్నాను. అప్పటివరకూ నాకలాంటి పరిస్థితి గురించి తెలియకుండా మాధవే అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకుంటోందని అర్థమైంది!

ఆరోజు.. ఇలాంటి ఎడతెగని ఆలోచనలతో ఊరంతా తిరిగి... చివరకు ఊరి చివరగా ఉండే చెరువు దగ్గర కూర్చున్నా.

ఇదేమిటి... మా ఊరు ఇలా మారిపోయిందేం...? పచ్చదనమంతా ఎటు పారి పోయింది? పక్షుల జాడలేదు.. ఎటునుండి వాటి కిలకిల రావాలు వినిపించటమే లేదు..! ఇన్నాళ్ళూ నేను గమనించలేదా... పట్టించుకోలేదా...?

అటు చూడగానే చెరువులోనూ నీరు చాలా తక్కువగానే ఉంది... జాడ జాడలుగా! ఇలా ఉంటే.. కొన్నాళ్ళకు మా ఊరి స్వరూపం ఎలా ఉంటుంది...? తిండీ తిప్పలకూ... నీటికీ... అన్నిటికీ కరువే...!

పశుపక్ష్యాదుల జాడన్నది లేకుండాపోతే, మనిషికి మనుగడ ఎలా ఉంటుందీ...! ఈ ప్రశ్న వేధిస్తోంటే... అలా నిస్తేజంగా ఒడ్డున కూర్చున్న నాకు ఒక దృశ్యం కంటపడింది. ఒక చిన్న కుర్రాడు.. చిన్న మట్టికుండతో నీళ్ళు పట్టి... పరుగు పరుగున అటువేపు వెళ్ళాడు... నేను ఏం చేస్తున్నాడోనని గమనించాను.

మళ్ళీ వచ్చి.. మళ్ళీ నీళ్ళు తీసుకెళ్ళాడు.. అంత ఓపికగా నీళ్ళు తీసుకువెళ్ళి ఏంచేసి వస్తున్నాడు.. అర్థం కాక అతనినే అడుగుదామని దగ్గరకు వెళ్ళి పలకరించాను.

అతని మాటలు వినగానే... నా ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది!

హైస్కూలులో చదువుకుంటున్న విద్యార్థి ఆ అబ్బాయి.

ఒకరోజు బడికి వెళ్తున్నపుడు... అక్కడ చిన్నజంతువులు చనిపోయి ఉండటాన్ని చూసి... వాళ్ళ స్కూలు మేష్టారుకి చెప్పాడట.

'ఆ జంతువులే కాదు... నీళ్ళు లేకపోతే మనుష్యుల గతీ అంతే అవుతుంది. ఈ విషయం అర్థం చేసుకోకుండా మనిషి చెట్లను నరికేస్తూ తన అంతానికి తనే పాల్పడుతున్నాడు' అని జవాబు చెప్పారట!

'అయితే... మొక్కల్ని పెంచితే, ఈ అనర్థం ఉండదా...?' అని తన సందేహాన్ని ఆయన ముందు ఉంచితే, 'అంతేకదా...' అన్నారట!

ఆ మాటలు ఆ అబ్బాయిలో ఆలోచన పెంచాయి. మొక్కలు నాటాలనే సంకల్పానికి నాంది,బీజం అతని మనసులో పడింది! ఆచరణలో పెడుతున్నాని చెప్పాడు.. అతనికి దొరికిన నాలుగు మొక్కల్నీ దూరంలో కనిపించే నేలలో పాతి... బడికి వెళ్ళేటప్పుడో, తిరిగి వచ్చేటప్పుడో మట్టి కుండతో నీళ్ళు పోస్తున్నానని చెప్పాడు! 'ఆ ఖాళీ ప్రదేశమంతా ఇలా మొక్కలతో పెరిగిపోతే... పెద్ద అడవిలా ఉండదూ...?' మెరిసే కళ్ళతో అన్నాడు.

అంతలోనే మొహంలోకి దిగులు వచ్చేసింది 'మా నాన్నకి ట్రాన్సఫర్ వస్తుందని మా ఇంట్లో అనుకుంటున్నారు. అంటే.. మేం ఇక ఇక్కడ ఉండం...! ఆ మొక్కల్ని పెంచటం నా వల్ల కాదేమో...!' అన్నాడు.

నేనా మాటలకి కదిలిపోయాను. వెంటనే మాట ఇచ్చేశాను. 'మీ నాన్నకి ట్రాన్సఫరు వస్తుందో రాదోగానీ, నువ్వు ప్రారంభించిన ఈ మొక్కల పెంపకాన్ని నేను కొనసాగిస్తాను. రోజూ... కావిడేసుకుని నీళ్ళు పోస్తాను... సరేనా...? మరి నువ్వు... ఈ దిగులేం లేకుండా శ్రద్ధగా చదువుకో...!'

ఆనందంతో ఆ అబ్బాయి మొహం వికసించింది!

'ప్రామిస్...' అంటూ చేయి చాపాడు, నేనూ ఆనందంగా ఆ చిన్ని చేతిలో చేయి వేశాను! ఎందుకోగానీ, ఆక్షణం.. నా ఒళ్ళు పులకరించినట్లుగా ఝల్లుమంది...! ఒక మంచి నిర్ణయం... వెంటనే తీసుకోగలిగినందుకేమో...! పండితులైనా, పామరులైనా వయసులో పిల్లలైనా, పెద్దలైనా... ఎవరు ఏం చెప్పినా, ఆ మాటలలో నిజం ఉందని మన మనసుకు తోస్తే.... ఆచరణలో పెట్టటానికి వెనుకాడకూడదు. నరసింహమూర్తిగారొకసారి చెప్పిన మాట ఆ క్షణంలో గుర్తుకువచ్చింది కూడా!

నాకప్పుడు.. ఒక దారి స్పష్టంగా కనుపించింది! అవును... ఇదే నా మార్గం...! నాకీ మార్గనిర్దేశం చేసిన చిన్ని గురువుకి నేను మాట ఇచ్చాను! ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆమాటని తప్పకూడదు... అని గట్టిగా నిర్ణయించుకుని... ఇంటిదారి పట్టాను!

నా నిర్ణయం విని... అమ్మ, మాధవీ కూడా నిర్ఘాంతపోయారు! ఆ తర్వాత ఆలోచించి ఆమోద ముద్ర వేశారు.

'నీకేది మంచిదనిపిస్తే... అదే చేయరా...' అంది అమ్మ నిర్లిప్తంగా.

'మీకే పని నచ్చితే అదే కానివ్వండి... మునుపటి మనిషిలా మీరు హుషారుగా,

ఆరోగ్యంగా ఉండటమే.. మాక్కావలిసింది..!' అంది మాధవి.

"మాధవి ఆ మాటలు నిజాయితీగానే చెప్పిందనుకున్నా... అందుకే ఆనందంగా ఆ మార్గంలోనే సాగాలనుకున్నా. నచ్చినదారిలో పయనించటం ఎవరికైనా ఆనందంగా ఉంటుందనుకుంటా! ఉత్సాహంగా వెంటనే ఆచరణ ప్రారంభించేసాను కూడా!

ఆ అబ్బాయిని నేను మళ్ళీ చూడటం జరగనేలేదు! కానీ అతనే నా గురువుగా భావించాను ఒక నిముషం చెప్పటం ఆపి మంచి నీళ్ళు తాగుతోంటే...

నేను చిన్నగా అరిచినట్లుగా....

"మీరు ఇప్పటివరకూ మీ పేరు ఎక్కడా చెప్పలేదు! అయినా, నాకు ఇప్పుడే గుర్తువచ్చింది... అందుకే అడ్డం వచ్చాను. 'గోపాల స్వామి' కదండీ మీకు మీ పెద్దవాళ్ళు పెట్టిన పేరు..?" అనడిగా.

ఆయన చిరునవ్వుతో తలవూపి 'అవునమ్మా... అదే...! నేను పుట్టినప్పుడు ఆ కబురు చెప్పటానికి నరసింహమూర్తిగారింటికి మా నాన్న వెళ్తే... ఆయన గోపాలకృష్ణ గోఖలే.. అంటే.. మన జాతీయ నాయకుని జీవిత కథ చదువుతున్నారట! అందుకే వారు ఆ పేరు పెట్టమని సూచించారనీ, మా నాన్న కూడా 'గోపాల స్వామి' అని పేరు పెడతానని చెప్పి, అలాగే చేశాడన్నమాట! మా తాత పేరులోని 'స్వామి' కూడా మానాన్న చేర్చాడు... ఇదమ్మా... నా పేరు వెనకనున్న కథ. ఈ విషయం నాతో మా నాన్నే చెప్పాడొకసారి.' అని ఓ రెండు నిముషాలు ఆగి మళ్ళీ మొదలుపెట్టారు.

'చెప్పాను కదమ్మా.. ఈ మూడవ అధ్యాయానికి గురువెవరో...! నేను ఇప్పటిరవకూ ఎక్కువగా నా జీవితం గురించే చెప్పాను. అడవి పెంపకం అనే ఆలోచనకు పునాది అలా పడినా, అప్పటి వరకూ గడిచిన నా జీవితంలోని వ్యక్తుల ప్రభావమే బలం చేకూర్చింది! ఒక చిన్న పిల్లాడికి ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండాలనే నైతిక విలువ, వెనుక మా ఊరి ప్రజలకు మేలు కలుగుతుందనే ఆశ, ఆ సంకల్పానికి బలం ఇచ్చిందనుకుంటున్నా!

ఇన్నేళ్ళుగా దానికే కట్టుబడి ఉండగలిగానంటే... మా కుటుంబం, మా ఊరి ప్రజల సహకారం వలనే...!

అప్పటి నుండి నేను ఉదయమే... ఉద్యోగానికి బయలుదేరినట్లుగా... ఇంత అన్నం క్యారేజిలో పెట్టుకుని సైకిలు పై బయలు దేరి వచ్చేసేవాడిని. నాకు దొరికిన, సేకరించగలిగిన అన్ని రకాల మొక్కల్నీ నాటటం... కావిడేసుకుని కుండలతో నీరు ఆ చెరువునుండే తీసుకుని వెళ్ళి పోయటం చేస్తూ వచ్చాను! ఎప్పుడూ నాకు శ్రమ అన్నదే కలుగలేదు...! పైగా మొక్కలు పెరుగుతూంటే... తండ్రికి కలిగే పుత్రోత్సాహం లాంటిదే నాకూ కలిగేది!

ప్రకృతితో అనుబంధం ఏర్పరచుకున్న మనిషికి కలిగే అనుభూతి అపూర్వమైనది! ఈ విషయం నాకు అనుభవపూర్వకంగా అర్థమైంది!

అడవిలోనే ఉండి... పగలంతా పనిచేస్తున్నప్పుడు... మనుష్యులకు దూరంగా బ్రతుకుతున్నానని ఏనాడూ అనిపించలేదు..!ప్రకృతి మాత ఒడిలో హాయిగా సేదతీరుతున్నట్లే ఉండేది! ఇప్పటికీ అంతే... చెట్ల ఆకుల గలగలలు... నాకు చక్కని సంగీతమే...! ఇంకా

వివరంగా చెప్పాలంటే... చెట్లే నాకు నేస్తాలు... సర్వస్వమూనూ..'

ఒకాయన ఎవరోవచ్చి అడవినీ, నన్నూ చూసి.. 'ఇక్కడ ఒంటరిగా ఉన్నారు... మీకు కాలక్షేపం ఏమిటీ...?' అనడిగాడు.

ఓ పెద్ద కుటుంబంతో కలిసి బ్రతుకుతున్న పెద్ద మనిషిని ఈ ప్రశ్న అడిగితే ఎలా ఉంటుందో, నాకూ అలానే అనిపిస్తోందని సమాధానం చెప్పాను! లేకపోతే... ఇంత పెద్ద అడవిలో... ఎన్నో రకాల వృక్షజాతులు... రకరకాలైన జంతువులు మధ్య బ్రతుకుతున్నవాడికి ఒంటరితనం ఉంటుందా...? కాలక్షేపానికీ కొదవ ఉండదు...! అసలు తీరికే ఉండనప్పుడు కాలక్షేపం ప్రశ్న తలెత్తదు కదా...!

ఎవరైనా వచ్చి నాకు తెలియకుండా ఏ చెట్టు కొమ్మయినా నరికితే, పిల్లలకి గాయాలయితే, విలవిలలాడే తల్లి పరిస్థితిలా నాదీ ఉండేది!

అవును... నేను పెంచిన ఆ అడవిలోని ప్రతీ చెట్టూ నాకు ప్రాణ సమానమే...!

అసలు మనిషి మనుగడకు ప్రకృతి వనరులేగా ఆధారం!

ప్రాణవాయువు దగ్గరున్నండి ఎన్ని రకాల అవసరాలో...! మనిషి చెట్లకు ఏ కొంచమైనా చేయగలిగితే, అది ఉచితం కాదు, తీసుకున్నదానికి రుణ చెల్లింపు మాత్రమే...! అవును... ప్రకృతికి మనిషి ఎప్పుడూ రుణగ్రస్తుడే...!

'ఇక్కడ ఎపుడు ఏ జంతువు మీద పడి దాడి చేస్తుందోననే భయం మిమ్మల్ని వేధించదా..?' అతని మరో ప్రశ్న అది!

నేను చిన్నగా నవ్వాను.

"క్రూర జంతువుల్లో కూడా కరుణ కనిపిస్తూంటుంది! ఎన్నో విధాలుగా మంచితనపు ముసుగు క్రింద మనుష్యులు చేసే క్రూర కర్మలకి భయపడాలి గానీ జంతువులలో అటువంటి భయంలేదండీ...! అవి ఆకలికి మాత్రమే మరో జంతువుపై దాడిచేస్తాయేగానీ, మనుష్యులకి మల్లే.. దోచుకుని దాచుకునే లక్షణం వాటికి ఉండదు అని నా అభిప్రాయం" అతనూ అవునన్నట్లుగా తల ఊపాడు...!

ఇది అందరికీ తెలిసిన సత్యమే...! అత్యాశతో దాడి చేసేది మనిషే మరి! అతను

ఒక క్షణం ఆలోచించి... 'అందుకే కదండీ, ఒక కవిగారు మనిషి... మనిషికీ కుదరదేమోగానీ... అన్నారూ...!' అన్నాడు.

ఏ జంతువు కూడా తనకి ఆహారంగా పనికి వచ్చే జంతువు మీద తప్ప తన జాతికే చెందిన దానిపై దాడిచేయదు! మనిషి మాత్రం తన తెలివి తేటలన్నీ ఉపయోగించి, తన సాటి మనిషికే ద్రోహం తలపెడతాడు.. డబ్బుకోసం హత్యలు చేయటానికయినా రెడీ అయిపోతాడు కదా...!

అతను వెళ్ళిపోయాక... తలక్రింద చేతులు పెట్టుకుని... చెట్టు నీడన కాసేపు నడుం వాలిస్తే... ఎన్నో ఆలోచనలు.. నరసింహంగారు చెప్పిన విషయాలూ గుర్తుకు వచ్చాయి...!

పదవికి రాజీనామా చేసి మా ఊరు వచ్చేశాక, వారి ఇంటిలో కలిసినప్పుడల్లా...

ఏవో గుర్తుకు వచ్చిన విశేషాలన్నీ చెబుతూండేవారు!

వరహాలరావు అనే అమ్మగారి తరుపు బంధువు రోజూ వచ్చి ఆత్మీయుడిలా క్షేమ సమాచారాలు వాకబు చేయటమే కాకుండా... అవసరమైతే... వారికోసం తన ప్రాణాలైనా ఇవ్వటానికి సిద్ధమనే విధంగా వ్యవహరిస్తూ ఉండేవాడు. ఇంట్లో పనివాళ్ళ దగ్గర్నుండి అందరూ ఆయన్ను చాలా గౌరవంగా, అభిమానంగా చూసేవారు! అందరి దృష్టిలో ఆయన మంచికి మారు రూపమే...! మాటెంత తీయనో... మనసూ అంతేనని అందరూ భావించేవారు! ఆయన ప్రవర్తన ఆ రేంజిలో ఉండేది మరి! అటువంటి ఆయనే... ఎన్నోసార్లు ఎన్నో రకాలుగా ఉప కారాలు పొందిన ఆయనే... అమ్మగారితో ఏవో మాయమాటలు చెప్పి... కాగితాలపై సంతకాలు చేయించుకుని, ఆమె పేరనున్న విలువైన స్థలాన్ని కాజేయటం జరిగిందట!

అది నిలదీస్తే... నాకు రావాల్సిన దానికిగానూ అది తీసుకున్నట్లు చెప్పి... అప్పటినుండీ కనిపించటమే మానేసాడట...! తనకి కావల్సింది కాజేయగలిగాక, ఇక వాళ్ళతో పనేముందీ అని అనుకున్నాడేమోనంటూ నరసింహంగారు ఈ ఉదంతం గురించి చెప్పారు. అప్పుడే... ఇదంతా చెప్పి... చివరగా ఓ మాట అన్నారు...'తప్పుచేసి దొరికాక, ఏదో అర్థం పర్థం లేని, పొంతన కుదరని సాకులతో తప్పించుకోవాలనుకుంటూ... తప్పును సమర్థించు కోవటం... మనిషి దిగజారుడుతనానికి నిదర్శనం! తప్పు ఒప్పుకుని క్షమాపణ కోరటం... మనిషి లక్షణం...! ఇంత దగాకోరు మనిషిని ఏ జంతువుతోనూ పోల్చటమూ సరికాదు...! ఎందుకంటే.. పక్కనే ఉండి... సాటి జంతువును... నటిస్తూ నయవంచన చేయటం... ఏ జంతువులోను చూడలేదుగా!'

ఇలాంటి మనుష్యులు చేసిన పనులకే నరసింహంగారికి రాజకీయాలంటే వెగటు పుట్టింది కాబోలు! అలాంటివన్నీ విన్నప్పుడు..వాతావరణ కాలుష్యంలా.. రాజకీయాల్లో అంతకు మించిన అవినీతి కాలుష్యం...నిజాయితీ పరులను ఉక్కబోతకు గురిచేసి తరిమేస్తోం దనుకున్నా...! మరి అందుకేగా, అక్కడ నుండి వచ్చేసాక, మా ఊరిలో ప్రశాంతంగా, హాయిగా ఉందని నరసింహంగారు అనుకోవటం...! అది నాకూ తెలుసునూ!

నిజం చెప్పాలంటే... చెట్లతో చెలిమి ప్రారంభించాక... నేనూ అలాంటి హాయినే అనుభవిస్తున్నాను!

ప్రతి రోజూ అడవంతా తిరుగుతూ చేతనున్న గొడ్డలి లేక కత్తితోనో ఎండుకొమ్మల్ని కత్తిరించేస్తూ ఉంటాను! దారిలో మొలిచే తుప్పల్ని తొలగిస్తూంటాను!

ఒకరోజు... అలా తిరుగుతున్నప్పుడు... ఒకామె... ఒక పులి కళ్ళల్లోకి చూస్తూ చేతులు చాపి నిలబడింది...!

ఆ దృశ్యం చూసి నేను స్థాణువునైపోయాను...!

అప్పుడప్పుడూ పులులూ, ఏనుగులే కాదు... చాలా రకాల జంతువులూ కళ్ళ బడుతూంటాయి! అయితే ఆమె అలా పులికి ఎదురొడ్డి ఎందుకు నిలబడిందో చూసీ చూడగానే కనిపెట్టా. ఓ చిన్న పిల్ల ఆమె వెనుక భయం భయంగా నిలబడి ఉంది! బిత్తర చూపులతో వణికిపోతోంది కూడా!

ఇదంతా ఒక క్షణంలోనే గ్రహించిన నేను... ఆలశ్యం చేయకుండా, ఆ తల్లీ పిల్లను వెనక్కి నెట్టి... నేను ముందు నిలబడ్డాను! ఆ క్షణంలో వాళ్ళను కాపాడాలనే తపనే తప్ప... నేను పులిని ఎదుర్కోగలననే భావన లేనేలేదు!

అనుకోని విధంగా... క్షణంలోనే ఆ పులి పరుగెత్తి పారిపోయింది! అలా ఎందుకు చేసిందో...! అది... అర్థంకాని విషయమే...!

నన్ను... ఆ అడవి సంరక్షకుడిగా గుర్తించి... కరుణ చూపిందా..?!

లేక తన పిల్లకూనలు గుర్తువచ్చి... వాటికోసం పరుగెత్తి వెళ్ళిపోయిందా...? తల్లీ పిల్లను చూసి జాలిపడిందా...? అంతటి విచక్షణ అలాంటి జంతువుకు ఉంటుందా...? ఇవేమీ ఊహకు అందకపోయినా, గొప్ప విచిత్రం మాత్రం జరిగింది...!

'నువ్వెందుకన్నా... అలా పులికి ఎదురుగా మా ముందుకు దూకివచ్చావ్...?' విస్మయంగా అడిగిందామె.

'మరి నువ్వు... నిలబడ్డావుగా, ఆ క్షణంలో... మిమ్మల్ని రక్షించగలగాలనే ఆలోచనే తప్ప... ఏం చేయాలో... ఏమీ తోచని పరిస్థితిలో, అనుకోకుండానే ముందుకు వచ్చేశాను...!' అన్నాను.

'నేనంటే... నా పిల్లను రక్షించుకోవాలని, ఆ ప్రయత్నంలో పులికి ఆహారమైనా ఫరవాలేదు... నా పిల్ల బతికి బయటపడితే, అంతే చాలన్న తెగింపుతో అలా చేశాను... కాదు... చేయగలిగాను... మరి నువ్వెందుకన్నా... ఏ బంధుత్వమూ లేని మాకోసం.. నీ ప్రాణాలను ఒడ్డాలనుకున్నావూ...?' అనడిగింది.

'మొక్కల్ని నాటడమే కాకుండా జాగ్రత్తగా సంరంక్షించటమూ నా బాధ్యతేనని ఎలా అనుకుంటానో..అలాగే,ఈ అడవిలోకి అడుగుపెట్టే వాళ్ళందరితో నాకూ అనుబంధం ఉందని అనుకుంటా...! ఈ అడవిని చూడాలని వచ్చే వాళ్లంతా నాకు ఆత్మ బంధువులే...! వాళ్ళని కాపాడటమూ నా ధర్మమే కదా...!' అంటూ ఆమె ఎందుకు వచ్చిందీ, ఏమిటీ అని వివరాలడిగాను.

నాలుగైదు రోజులుగా వచ్చి పుల్లలేరుకుని వెళ్తోందట...! 'అన్నా... నేను ఏ చెట్టు కొమ్మా విరగదీయలేదు... క్రిందపడిన ఎండుకొమ్మల్నే ఏరుకుని వెళ్ళి అమ్మి సొమ్ము చేసుకుని... ఇద్దరం ఇంత తింటున్నాం...! ఈ నాలుగు రోజులుగా ఏ జంతువు కనిపించలేదు... అందుకే ధైర్యంగా తిరుగుతున్నా...! అందరూ నీ గురించి... నాకు ముందే చెప్పారు... ఏ చెట్టుమీద చెయ్యి వేసినా నువ్వు వూరుకోవని...! అన్నా... నువ్వు చెట్లతో కూడా మాట్లాడతావని సెప్పారు... ఆటి బాస నీకు వచ్చా...?' నవ్వు మొహంతో అడిగింది.

ఏం చెప్పాలో ఒక నిముషం అర్థంకాలేదు!

'చెట్లకి భాష అంటూ ఉంటుందని అనుకోవటంలేదు గానీ, వాటిపై చేయి వేసినపుడు ఆ స్పర్శ... నాకేదో చెబుతున్నట్లుగా అనిపిస్తుంది...! అలాగే, బదులుగా నేనూ ఏదో అప్పటికి తోచినది చెబుతూంటా...! పొద్దంతా... నా చెలిమి ఈ చెట్లతోనే మరి...!' అంటూ నేనూ చిన్నగా నవ్వాను.

తరువాత నిదానంగా కూర్చుని తన వివరాలు చెప్పింది.

ఆమెకు చాలానాళ్ళు పెళ్ళికాలేదు. చివరకు ఎవరో రెండో పెళ్ళిగా చేసుకున్న అతనూ కొన్నాళ్ళకే ఏదో జబ్బుతో చనిపోయాడట...! వయసులో పెద్దగా కనిపిస్తున్న ఆమెకు అంత చిన్న పిల్ల ఏమిటని అనుకుంటాననుకుని, ఆ వివరణ ఇచ్చింది కాబోలు! పిల్లతో కలిసి ఇలాంటి చిన్న చిన్న పనులతో పొట్ట పోషించుకుంటున్నానని చెప్పింది.

'అయ్యో' అనుకున్నాను. ఒంటరిగా జీవనపోరాటం చేయాల్సి వచ్చిందన్న సానుభూతితో అంతకుముందే కోసి ఉంచిన పళ్ళు, కూరగాయల్ని ఒక సంచీలో వేసి ఇచ్చాను.

ఆమె మొహం ఇంతయిపోయింది ఆనందంతో...!

ఆ తరువాత వచ్చినపుడు... చిన్న గిన్నెతో పాయసం కాబోలు... తనే చేసానంటూ తెచ్చి ఇచ్చింది...!

అప్పుడప్పుడూ నేను పళ్ళు, కూరగాయలు ఇవ్వటం... ఆమె కూడా నేను తినటానికి ఏదో తేవటం మామూలయింది!

పొద్దున్నే నేను ఇంటినుండి వచ్చేటప్పుడు సైకిలుకు అన్నం క్యారేజి కట్టుకునే వస్తాను...! అపుడపుడూ మాత్రం మాధవే పట్టుకు వస్తుంది! 'నీకెందుకు శ్రమ... ఇంత దూరం నడవాలి... కాలువ దాటాలి...' అన్నాను... ఒకసారి.

'శ్రమకాదు... సరదా...!' అంది నవ్వుతూ. 'పొలంలో పనిచేసే వాళ్ళకు... వాళ్ళ ఆడవాళ్ళు భోజనం తెచ్చి... పొలం గట్టుమీద కూర్చుని... అన్నం కలిపి ముద్దలు అరచేతిలో పెడితే... అబ్బో... ఆ రుచే అదిరిపోతుందని చెప్పుకోవటం విన్నా... నిజమే.. ఇలా ఇద్దరం చెట్ల నీడను... చల్లగాలికి తింటోంటే... ఇంటిదగ్గర కంటే.. చాలా సరదాగా బావుంది! అందుకే... ఇద్దరికీ కలిపి అప్పుడప్పుడూ నేనే తెస్తున్నా...!' అంటూ మాధవి మళ్ళీ హాయిగా నవ్వింది.

ఒకోసారి ముగ్గురం కూడా కలిసి కబుర్లు చెప్పుకోవటమో, తినటమో జరుగుతుండేది. ఆమె పేరు పున్నమ్మ అని చెప్పింది. పిల్లని మళ్ళీ తీసుకురాలేదు. ఆ అమ్మాయి బాగా భయపడి ఉంటుంది. అందుకేనేమో ఇంటి దగ్గర ఉంచి వస్తోంది.

తనూ పుల్లలేరుకుంటూనే, నా పనులకూ సాయంగా ఉంటోంది.

ఇది చూసిన కొందరు వూరివాళ్ళు మా ఇద్దరిమీదా పుకారు లేవదీసారని తెలిసింది!

ఈ మధ్య కాలంలో మా ఇంటిలోనూ కొన్ని మార్పులు జరిగాయి. మా అమ్మ కాలం చేసింది! పిల్లలు పెద్దవాళ్ళు అవుతున్నారు.

మా ఊళ్ళోచెరువులన్నీ నీళ్ళతో నిండాయి.... వర్షాలు బాగా పడటం వలనే! పంటలూ సమృద్ధిగా పండటంతో ఈ మధ్యలో కరువన్నదే లేదు...! అంతా అడవి పెంపకం వల్లే సాధ్యమైందని... అందుకు కారకుడిని నేనేనని... అందరూ ఏక కంఠంతో కీర్తించారు! మా ఊరు పచ్చదనంతో కళకళలాడుతోంది...!

ఇది చాన్నాళ్ళనుండి జరుగుతోంది... నా గురించి మా ఊరి వాళ్ళకు బాగా తెలుసును! అయినా సరే, ఈ వదంతిని మాత్రం ఖండించకుండా నమ్మేయటం నాకు ఆశ్చర్యంగా,

విచిత్రంగా అనిపించింది!

మనుష్యులు స్వభావం మాత్రం మారదా... ఎప్పటికీ ఒకే తీరున ఉంటుందా...?! ఈ పుకారు గురించి పున్నమ్మ కూడా విన్నది కాబోలు 'అన్నా... నీకెంతో మంచిపేరు ఉంది. నా మూలంగా ఆ పేరుకి మచ్చ తీసుకురావటం నచ్చలేదు...! నేనిక ఇటువైపురాను... అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.